క్లుప్తంగా

నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట నిర్వహించనున్నట్లు చెప్పారు. సచివాలయాల్లో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన ఉంటుందని చెప్పారు.

ఆకట్టుకున్న చిత్ర కళా ప్రదర్శన



చిత్ర కళాప్రదర్శనను సందర్శించిన మేయర్ మనోహర్‌నాయుడు

పాత గుంటూరు: రళ మ్యూరల్ చిత్ర కళా ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధ్యాన మందిరంలో కృష్ణాష్టమి పురస్కరించుకొని మధుర్ ఆర్ట్ స్కూల్ కరస్పాండెంట్ పి.మధుసూదనరావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మేయర్ కావటి మనోహర్‌నాయుడు హాజరయ్యారు. చిత్ర ప్రదర్శనలో పెయింటింగ్స్ వేసిన విద్యార్థులను అభినందించారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



సభలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పాత గుంటూరు: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటీనియల్ ఆధ్వర్యంలో రింగురోడ్డులోని జె.కె.సి. కళాశాలలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని తెలిపారు. వైద్యులు డాక్టర్ రాకేష్, డాక్టర్ ప్రియాంక రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు షాజహాన్ పేరేచర్లలోని సాయినాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఏజీ గవర్నర్ సుబ్బారావు, కళాశాల చైర్మన్ జాగర్లమూడి మురళీమోహన్, కార్యదర్శి రాజగోపాల్, కోశాధికారి స్రవంత్, అభయ, సి.హెచ్. ఏడు కొండలు, అనిల్, వి.సురేష్, రాఘవ, పెరుమాళ్ రమణ బాబు, వంశీ పాల్గొన్నారు.

6న విజ్ఞాన మందిరంలో శివ శంఖారావం

పాత గుంటూరు: శ్రీ కృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీన వాసవి ఇంటర్నేషనల్ పరివార్ ఆధ్వర్యంలో శివ శంఖారావం నిర్వహించనున్నట్లు కన్వీనర్ దేవరశెట్టి రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆర్ అగ్రహారంలో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో నిర్వహించనున్న కార్యక్రమంలో రుక్మిణీ కల్యాణం, అలంకార ప్రదర్శన, సర్ప సూక్త హోమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9246674889, 9885062116 సంప్రదించాలని కోరారు. సమావేశంలో గ్రంధి హనుమంతరావు, పరిటాల వెంకటేశ్వరరావు, వి. రఘు, రవీంద్రకుమార్, ఆతుకూరి నగేస్‌కుమార్, టీ.ఎల్.వీ.. వీరాంజనేయులు, మొగిలి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

భార్య, అత్తమామలపై దాడి

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తి భార్యను, అత్తమామలను కర్రతో కొట్టి దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. రామిరెడ్డి నగర్‌లో నివసించే కట్టా సతీష్, దేదీప్యలకు 2019లో వివాహం అయింది. వీరికి పిల్లలు పుట్టలేదు. సతీష్ ఈ కారణంతో భార్యను తరచు వేధించి కొట్టేవాడు. కొద్ది రోజుల క్రితం సతీష్ భార్యను పుట్టింటికి పంపించాడు. శనివారం సతీష్, ఏటి అగ్రహారం 2వ లైనులోని అత్తవారింటికి వెళ్లి గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో సతీష్ కర్ర తీసుకుని భార్య, అత్తమామలను తలపై కొట్టి గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్స్



నెహ్రూ నగర్ మెయిన్ రోడ్ లో ప్రమాద భరితంగా వేలాడుతున్న ఫ్యూజ్ బాక్స్

నెహ్రూ నగర్: స్థానిక నెహ్రూ నగర్ 9వ లైన్ మెయిన్ రోడ్ లో విద్యుత్ ఫ్యూజ్ బాక్స్ రోడ్డు మీదకు వేలాడుతూ ప్రమాద భరితంగా మారింది. అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు చూడకుండా ప్రమాదవశాత్తు ఫ్యూజ్ బాక్స్‌ను తగిలితే ఎటువంటి నష్టం జరుగుతుందో అని వాహనదారులు, స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


గుంటూరు సంగడి గుంటకి చెందిన పదేళ్ల రుక్మిణీ అనారోగ్యానికి గురైంది. తల్లిదండ్రులు వారం రోజుల క్రితం ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైరల్ హెపటైటస్ ఏ వ్యాధి బారిన పడినట్లు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు నిర్ధారించారు. జ్వరం, కడుపు నొప్పి, వాంతులు, పచ్చ కామెర్లు లక్షణలు కనిపించాయి. బాలిక రెండు రోజుల క్రితం స్థానికంగా రోడ్డుపై ఉన్న బండి వద్ద పానీపురిలు తిని, కలుషితమైన నీరు తాగటం వల్ల హెపటైటీస్ సోకినట్లు వైద్యులు చెబుతున్నారు.

పాతగుంటూరుకు చెందిన ఆరేళ్ల షారుఖ్ వాంతులు, విరేచనాలు, కామెర్లుతో బాధపడుతుంటూ ఐదు రోజుల క్రితం జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు పరీక్షలు చేసి హెపటైటీస్ ఏ సోకినట్లుగా నిర్ధారించారు. వారం రోజుల క్రితం ఇదే సమస్య వాళ్ల సోదరి రేష్మ కూడా వచ్చింది. సోదరికి హెపటైటీస్ తగ్గిన తరువాత ఒకే ఇంట్లో ఉండటం ద్వారా సోదరి శరీర ద్రవాల వలన సోదరుడికి వైరస్ సోకినట్లు వైద్యులు నిర్ధారించారు.

హెపటైటిస్.. అటెన్షన్

- పెరుగుతున్న కేసులు
- గుంటూరు జీజీహెచ్‌కు వారానికి 20 మంది బాధితులు
- ముందస్తు జాగ్రత్తలపై అవగాహన

గుంటూరు మెడికల్: గుంటూరు జిల్లాలో హైపటైటీస్ కేసులు పెరుగుతున్నాయి. జీజీహెచ్‌లో ప్రతి రోజు కేసులు నమోదు అవుతున్నాయి. ఆహారపు అలవాట్ల వలన అధికంగా వ్యాధి బారిన పడుతున్నట్లు చెబుతున్నారు. హెపటైటీస్ వైరస్ ఏ, ఈ కేసులు ఈ మధ్య కాలంలో బాగా విపరీతంగా నమోదవుతున్నాయని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు చెబుతున్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ కూడా వైరస్ బారిన పడడంపై వైద్య నిపుణులలో ఆందోళన వ్యక్తం అవుతోంది. గుంటూరు జీజీహెచ్‌కు వారానికి 20 మంది బాధితులు చికిత్స కోసం వస్తుండగా జిల్లాలో 13 మంది గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు ఉండగా, ఒక్కొక్కరు ప్రతిరోజూ ఇద్దరు బాధితులకు చికిత్స అందిస్తున్నారు. కలుషిత నీరు, ఆహారం ద్వారా సోకుతున్న హెపటైటీస్‌పై అప్రమత్తంగా ఉండి సకాలంలో చికిత్స తీసుకోని పక్షంలో తీవ్రత పెరిగే ప్రమాదం ఉందని, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



లక్షణాలు..

ఇటీవల కాలంలో నమోదవుతున్న హెపటైటీస్ ఏ, హెపటైటీస్ ఈ బాధితుల్లో ఎక్కువగా కడుపులో నొప్పి, నీళ్ల విరోచనాలు, వాంతులు, కళ్లు పచ్చగా రావడం, కామెర్లు, నీరసం, ఇతర సమస్యలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. మొదట జ్వరం వచ్చి రెండు రోజులపాటు జ్వరం బాధపెట్టిన పిదప తగ్గిపోయినపైన పేర్కొన్న లక్షణాలు బాధితుల్లో కనిపిస్తున్నాయి. లివర్ పరీక్ష చేస్తే విపరీతంగా వాచిపోయి ఉంటుంది. పసరుతిత్తిలో కూడా వాపు కనిపిస్తుంది. లిపిడ్ ప్రొఫైల్ పరీక్ష (ఎల్‌ఎఫ్‌టీ, అల్ట్రాసౌండ్ అబ్డామిన్ స్కానింగ్) పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు.

కారణాలు..

కలుషిత నీరు ఎక్కువగా తాగేవారిలో, హోటల్స్, బయట రోడ్లపై విక్రయించే ఆహారాలు ఎక్కువగా తినేవారిలో హెపటైటీస్ లక్షణాలు కనిపిస్తున్నాయి. నిల్వ ఉన్న పచ్చళ్ల తినడం, బేకరీ ఐటమ్స్ ఎక్కువగా తినేవారిలో కూడా వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇళ్లల్లో ఎవరికైనా వ్యాధి వచ్చి తగ్గితే వారి నుంచి ఇతర కుటుంబ సభ్యులకు సోకుతోంది. చిన్న పిల్లలు, టీనేజ్ వారిలో ఎక్కువగా వ్యాధి కనిపిస్తున్నట్లు వైద్య నిపుణులు వెల్లడించారు. పెద్ద వారిలో కూడా అరుదుగా కేసులు నమోదవుతున్నట్లు తెలిపారు.

తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి



వ్యాధి బాధితులను తప్పనిసరిగా నాలుగు వారాల పాటు ప్రత్యేక ఐసోలేటెడ్ గదిలో ఉంచి చికిత్స అందించాలి. లేని పక్షంలో వారి నుంచి ఇంట్లోని ఇతరులకు సోకే ప్రమాదం ఉంది. వ్యాధి బాధితుల దుస్తులు ప్రత్యేకంగా శుభ్రపరిచి విడిగా భద్రపరచాలి. వ్యాధి బాధితుల నుంచి ద్రవాలు ఇతరులకు అంటకుండా జాగ్రత్త పడాలి. వంద మందిలో 95 శాతం మంది త్వరితగతిన వారంతట వారే కోలుకుంటారు. వైద్యులను సంప్రదించకుండా ఆకుపసర్లు మింగడం, నాటు మందులు తీసుకోవడం ద్వారా జబ్బు తీవ్రత పెరిగి లివర్ దెబ్బతినే ప్రమాదం ఉంది. అర్హత ఉన్న వైద్యుల వద్దే బాధితులు చికిత్స పొందాలి. వేడి వేడి భోజనం తినాలి. పరిశుభ్రమైన నీటిని తాగాలి. వ్యాధి నుంచి త్వరగా కోలుకునేందుకు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి. లివర్ దెబ్బతినకుండా కొన్ని మందులు వాడాల్సి ఉంటుంది.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, జీజీహెచ్

19న చలో కలెక్టరేట్



పోస్టర్లును ఆవిష్కరిస్తున్న రాజసుందరబాబు, క్రైస్తవ సంఘ నాయకులు

నెహ్రూనగర్: రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 19న కలెక్టరేట్ వద్ద అన్ని చర్చిలు మినిస్ట్రీలు, పాస్టర్లతో క్రైస్తవులలో మహా ప్రార్థన కూటమిని ఏర్పాటు చేస్తున్నట్లు సామాజికవేత్త డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో చలో కలెక్టరేట్ ఆదివారం సాయంత్రంకు సంబంధించిన పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ యూసీసీ చట్టం కోసం ఐదు రోజుల పార్లమెంటు సమావేశాన్ని ఏర్పాటు చేయటాన్ని ఖండించారు. ఒక పక్క మణిపూర్ అంశం ఇంకా రగులుతూ ఉండగా, మరో పక్క హరియాణా లోనూ ఢిల్లీలోనూ క్రైస్తవులు, ముస్లింలపై వారి ప్రార్థన మందిరాలపై దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. శాంతినగర్‌కి చెందిన ఒక ప్రముఖ మినిస్ట్రీ పాస్టర్‌పైన, సంగడిగుంటకు చెందిన ఒక ప్రముఖ చర్చి పాస్టర్‌పైన రెండుసార్లు దాడులు జరిగాయని పోలీసులు కూడా కేసులు నమోదు చేసి వాటిని వదిలేశారని విచారణ వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూసీసీకి వ్యతిరేకంగా పాస్టర్లు ఐక్యంగా మహాశక్తిగా పోరాడితేనే ఈ దాడులు ఆగుతాయన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో క్రైస్తవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు మద్దు ప్రేమ జ్యోతి బాబు, ఎమ్మార్పిస్ నాయకులు కందుల దీనమణి రాజు, రాయపూడి మరియ దాసు, చిన్నం డేవిడ్ విలియమ్స్, క్రైస్తవ నాయకులు చింతల బెర్నాడ్ సత్య స్వరూప్, గోవతోటి ఆంథోని, ఎద్దు రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను వ్యతిరేకించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి రామారావు



మాట్లాడుతున్న పాశం రామారావు

పాత గుంటూరు: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం నిరంతరం పోరాటం కొనసాగిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో 'నిరుద్యోగం తగ్గుతున్న ఉపాధి' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి నగర కార్యదర్శి కె. నళినీకాంత్ అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నరేంద్ర మోదీ అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసగించారన్నారు. బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో ఉన్న ఉద్యోగాలు కోల్పోయి నిరుద్యోగం పెరిగిపోయిందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా ఉన్న ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. రైల్వే వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ, ఇప్పటికే ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా కేంద్ర ప్రభుత్వం రైలు ప్రమాదాలకు కారణమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి, డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాగులూరి కిరణ్, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు షేక్ బాషా, నగర భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసీం వలి, ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్‌కార్యదర్శి సీతారామయ్య, ఐద్వా నగర్ కార్యదర్శి ఎ.కళ్యాణి, సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి.ముత్యాలరావు పాల్గొన్నారు.

గురువులను సత్కరించడం మన బాధ్యత

రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఐపీడీజీ రాజశేఖర్ రెడ్డి



రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరించిన రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఐపీడీజీ (ఆర్ఐ డిస్ట్రిక్ట్–3150) తాళ్ల రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సాయిబాబారోడ్డులోని మౌర్య ఫంక్షన్ హాల్లో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషన్ బిల్డర్ అవార్డు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని క్లబ్ కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసరావు, లెటర్స్ అండ్ విల్స్ చైర్మన్ గోగినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. ముఖ్యఅతిథి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గురుపూజోత్సవ సందర్భంగా 10 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించుకోవడం సంతోషకరమన్నారు. 118 ఏళ్ల క్రితం స్థాపించబడిన రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ ప్రపంచంలో పోలియో నిర్మూలనకు కృషి చేసి, పోలియో మహమ్మారిని పారద్రోలిందని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ గుంటూరు అధ్యక్షుడు కేవీ భాస్కర్‌రావు, క్లబ్ ట్రైనర్ పీవీ సత్యనారాయణ, సభ్యులు అంకాల సుబ్బారావు, విశ్వేశ్వరరావు, శివప్రసాద్, కాలేషావలి, గరికపాటి సుధాకర్, వై.వేణుగోపాల్, గాలి సుబ్బారావు, పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యోత్సవం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆదివారం కేఆర్‌కేఎం మెమోరియల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కార్యదర్శి కోకా విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమరావతి నృత్యోత్సవం– 2023 నిర్వహించారు. కార్యక్రమాలను కేఆర్‌కేఎం వ్యవస్థాపకులు డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విజయలక్ష్మి శిష్యబృందం స్వాగత నృత్యం చేశారు. అనంతరం కొల్‌కత్తాకు చెందిన కృష్ణేన్దు బాసు బృందం కథక్ నృత్యం, హైదరాబాద్‌కు చెందిన పీ ప్రమోద్ రెడ్డి శిష్య బృందం భరత నాట్యం, ఇందిరా పరాశరం శిష్యబృందం చేసిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది.


ఇక ఆటాడుకుందాం..

- 1 నుండి 3వ తేదీ వరకు మండల స్థాయి..
- 6–10 వరకు నియోజకవర్గ స్థాయిలో క్రీడా ఎంపికలు
- అండర్–11, 14, 17 విభాగాల్లో పోటీలు
- ప్రతిభను చాటేందుకు గ్రామీణ క్రీడాకారులకు చక్కని అవకాశం



ఖోఖోలో తలబడుతున్న విద్యార్థులు (ఫైల్)

ప్రత్తిపాడు: ఆటలకు సమయం ఆసన్నమయ్యింది. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ప్రభుత్వం చక్కని అవకాశం కల్పించింది. గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరానికి సంబంధించి ఈ నెల ఒకటి నుంచి 10వ తేదీ వరకు ఎంపికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



మూడు విభాగాల్లో పోటీలు..

మండల, నియోజకవర్గ స్థాయిల్లో నిర్వహించనున్న ఈ పోటీలు అండర్–11, అండర్–14, అండర్–17 విభాగాల్లో జరగనున్నాయి. అండర్–11 విభాగంలో పాల్గొనేందుకు 2013 సెప్టెంబరు 1న లేదా ఆ తరువాత జన్మించిన వారు అర్హులు. అదేవిధంగా అండర్–14 విభాగాంలో పాల్గొనే క్రీడాకారులు 2010 జనవరి 1న, తరువాత జన్మించి ఉండాల్సి ఉంది. అండర్–17 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2007 జనవరి 1, తరువాత పుట్టిన వారై ఉండాలి. వ్యాయామ ఉపాధ్యాయులు అర్హతలను పరిశీలించిన అనంతరం మాత్రమే పోటీలకు అనుమతిస్తారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఈ ఆటల పోటీలు వేదిక కానున్నాయి. మండల స్థాయిలో ఎంపికైన వారిని నియోజకవర్గ స్థాయి ఎంపికలకు, అక్కడ ఎంపికైన వారిని జిల్లా స్థాయి ఎంపికలకు పంపించనున్నారు.

జరగనున్న పోటీలివే..

కబడ్డీ, ఖో ఖో, టెన్నికోయిట్, వాలీబాల్, త్రో బాల్, బాల్ బ్యాడ్మింటన్, బాడ్మింటన్ (షటిల్), యోగ, అథ్లెటిక్స్

క్రీడాకారులు యాప్ నందు నమోదు చేసుకోవాలి

మండల, నియోజకవర్గ స్థాయిల్లో జరగనున్న పోటీలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. మొత్తం తొమ్మిది రకాల క్రీడల్లో ఎంపికలు జరగనున్నాయి. ఈ మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పోటీలను అండర్–11, 14, 17 విభాగాల్లో జరపనున్నాం. ఆసక్తి ఉన్న క్రీడాకారులు పోటీల్లో పాల్గొనవచ్చు. పాల్గొనదలచిన క్రీడాకారులు కచ్చితంగా అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవలసి ఉంటుంది.

– పి. డేవిడ్ రాజ్‌కుమార్, మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్, ప్రత్తిపాడు మండలం.

దత్త పీఠంలో గణపతి వ్రతం

గుంటూరు రూరల్: చౌడవరం గ్రామంలోని దత్తనాథ క్షేత్రంలో ప్రధాన సంకట హర గణపతి వ్రతం భక్తి శ్రద్ధలతో ఆదివారం నిర్వహిస్తున్నారు. గణపతి సచ్చిదానంద స్వామిజీ ఆశ్రమంలో సహస్ర మోదక హోమం, విజయ గణపతికి ప్రత్యేక హోమాలు, నిర్వహించారు. హోమంలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందించి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

చేబ్రోలు: కుటుంబ సమస్యల కారణంగా ఓ యువకుడు ఎలుకల మందు తిని, ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన చేబ్రోలులో ఆదివారం జరిగింది. కాకుమాను మండలం పెద్దివారిపాలేనికి చెందిన వి.గోపీ చేబ్రోలులోని చెరువులోపాలేనికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. రెండు రోజుల క్రితం అత్తారింటికి వచ్చిన అతను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు ఇది గమనించి 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్సం నిమిత్తం గోపీని తరలించారు.

మాతాశిశు మరణాల తగ్గింపునకు కృషి



జ్యోతి ప్రజ్వలన చేసి సీఎంఈని ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: మాతా, శిశు మరణాల తగ్గింపు కోసం నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆస్పత్రిలోని శుశ్రుతా హాలులో గుంటూరు వైద్య కళాశాల ఆబ్స్టిక్స్ అండ్ గైనకాలజీ వైద్య విభాగం ఆధ్వర్యంలో జోనల్ నిరంతర వైద్య విద్య కార్యక్రమం(సీఎంఈ) నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏకుల కిరణ్‌కుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గర్భిణుల్లో ఎక్కువ మంది రక్త స్రావం జరగటం వల్ల మరణిస్తున్నారని తెలిపారు. ఇలాంటి మరణాలను తగ్గించటానికి పలు వైద్య విభాగాధిపతులతో ఒక టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. యూరాలజిస్ట్, జనరల్ సర్జన్, ఎనస్థీషియా, హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌తో కూడిన సభ్యులను నియమిస్తామన్నారు. గైనకాలజీ వైద్య విభాగంతో సమన్వయం చేసుకుంటూ మాతా, శిశు మరణాలను నివారించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గుంటూరు వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, ప్రొఫెసర్లు డాక్టర్ అరుణ, డాక్టర్ జయంతి, రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అల్ట్రాసౌండ్ ద్వారా నొప్పి లేకుండా ఆపరేషన్

గుంటూరు మెడికల్: రోగికి ఆపరేషన్ చేయడంలో మత్తు వైద్యుల పాత్ర కీలకమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అల్ట్రాసౌండ్ గైడెడ్ రీజనల్ ఎనస్థీషియా వర్క్‌షాపు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మత్తు వైద్యులు లేకుండా ఆపరేషన్లు చేయటం సాధ్యం కాదన్నారు. రోగికి నొప్పి లేకుండా అల్ట్రాసౌండ్ మిషన్ ద్వారా ఆపరేషన్ చేసే విధానంపై వర్క్‌షాపులో వైద్యులు శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. మత్తు లేకుండా ఆపరేషన్ చేయడమంటే చాలా మందికి భయంగా ఉంటుందన్నారు. అల్ట్రాసౌండ్ ద్వారా నొప్పి లేకుండా ఆపరేషన్లు చేసి రోగులను బతికించేందుకు అవకాశముందని వెల్లడించారు. రానున్న రోజుల్లో ప్రతి ఆపరేషన్ థియేటర్‌లో అల్ట్రాసౌండ్ మెషిన్‌లు ఏర్పాటు చేసి రోగులకు అవసరమైన ఆపరేషన్లు జరిగేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ బి.వి.మహేష్‌బాబు, డాక్టర్ కేపీ పోలయ్య, డాక్టర్ శ్రీప్రకాష్, డాక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు పంపిణీ



విద్యార్థికి నగదు బహుమతి అందిస్తున్న జస్టిస్ కృష్ణమోహన్

పాత గుంటూరు: నగరంపాలెంలోని జిల్లా పరిషత్ ప్రాంగణంలోని శ్రీ సత్యసాయి సేవా సమితిలో డాక్టర్ సురాపాణి, డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో గురు పూజోత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రోసూరు మండలం హసనాబాద్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని 80 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2500 నగదు, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను న్యాయమూర్తి అందించి అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులు, నిర్వాహకులను సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శాంకరి మాతకు వెండి ఆభరణాల బహూకరణ



గుంటూరు రూరల్: లాలుపురం గ్రామంలో వేంచేసిన శాంకరీ మాత ఆలయంలో అమ్మవారికి ఆదివారం ఉప్పు నాగేశ్వరమ్మ అనే భక్తురాలు వెండి ఆభరణాలను బహూకరించారు. ఏటుకూరు రోడ్డు ప్రాంతానికి చెందిన ఆమె తన భర్త ఉప్పు శంకరరావు జ్ఞాపకార్థం సుమారు రూ.90 వేలు విలువైన వెండి పాదాలు, హస్తాలు, ముక్కు పుడక అందించారు. ఈ సందర్భంగా జరిగిన పూజ కార్యక్రమంలో నాగేశ్వరమ్మతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఆభరణాలను శాస్త్రోక్తంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ప్రధాన అర్చకులు దేవలపల్లి శివప్రసాద్ శర్మ దంపతులు నాగేశ్వరమ్మను సత్కరించారు. ఆభరణాలు అమ్మవారికి అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

కోరిన కోర్కెలు తీర్చే దేవత పోలేరమ్మతల్లి

గుంటూరు రూరల్: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే తల్లి గ్రామ దేవత పోలేరమ్మతల్లి అని రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు అన్నారు. ఆదివారం చిన్నపలకలూరు గ్రామ దేవత పోలేరమ్మతల్లి ఆలయ వార్షిక పొంగళ్ల కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. గ్రామ ప్రజలు ఊరేగింపుగా బిందెలతో నీటిని తెచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మిర్చియార్డు డైరెక్టర్ ఇంద్ర, ఎం.వెంకటేశ్వర్లు, పి.నరసింహారావు, బాలకృష్ణ, నరేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.